10042025-DIS-04_Layout 1 4/10/2025 4:11 AM Page 1

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

నమస్తే తెలంగాణ

భూ దాహం పన్నిన పద్మవ్యూహం

ప్రభుత్వాలు భూములు అమ్మడం కొత్త కాదు. వాణిజ్యపరంగా అభివృద్ధి చెందిన ప్రాంతాల్లో ఉండే అధిక విలువ కలిగిన ప్లాట్లను అమ్మడం అప్పుడప్పుడూ జరుగుతుంటుంది. అయితే అందుకు ఓ రీతి, రివాజు ఉంటాయి. అందులో నిధుల సేకరణ తప్ప మరో లోపాయికారీ లక్షణమేదీ ఉండరాదన్నది అప్రకటిత నిబంధన. కానీ, హైదరాబాద్‌కు చెందిన 400 ఎకరాల అటవీ భూమి విషయంలో కాంగ్రెస్ సర్కార్ తీరు ఏ రకమైన నీతి, నిబద్ధతలకూ లొంగే విధంగా లేదని క్రమంగా ఆవిష్కృతమవుతున్నది. అసలు పైకి చెప్తున్నది ఒకటి, లోపలి ఉద్దేశం వేరొకటి కావడమే అందుకు కారణం. పూటకో మాట మాట్లాడే తత్తరపాటే సర్కారు దురుద్దేశాలను పట్టిస్తున్నది. తీగ లాగితే డొంకంతా కదిలినట్టు, పుట్ట పగిలితే పాములు బయటకు వచ్చినట్టు హెచ్‌సీయూ అటవీ భూముల వ్యవహారం వెనుక భారీ స్థాయి భాగోతమే ఉందని మెల్లమెల్లగా వెల్లడవుతున్నది.

అడ్డూ అదుపూ లేని భూ దాహం పన్నిన పద్మవ్యూహంలో అటు ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థ, అమాయక ప్రాణులు, చెట్టూ చేమా చిక్కుకొని విలవిలలాడుతున్నాయి. అడివే కాదని, వన్యప్రాణులే లేవని మొండివాదనతో ముందుకువచ్చిన సర్కారు తీవ్రస్థాయి ప్రతిఘటనతో, సుప్రీం కొరడా ఝుళిపింపులతో వెనుకకు తగ్గినా ఇంకా పచ్చదనానికి పూర్తిగా ముప్పు తప్పలేదనే చెప్పవచ్చు. సర్కార్ పట్టీలు కొడుతున్నది సకలంలో దొంగదెబ్బతీసి అడవిని మింగేయడానికే అని అర్థం చేసుకునేందుకు పెద్దగా ఆలోచించాల్సిన అవసరం లేదు. పైకి చెప్పింది రాష్ట్ర ఆర్థికస్థితిని మెరుగుపర్చడానికని. అసలు ఉద్దేశం భూములను అమ్మి భారీగా సర్కారు ఖజానాకు సొమ్ము సమకూర్చడం కానే కాదు. వేల కోట్ల అవినీతికి వేలం రంగు పులిమి హరితావరణం గొంతు నులిమేందుకు సర్కారు సమాయత్తమైంది. ఖజానాను జనం ముందు పెట్టి వెనుక నుంచి అగ్గువకే భూమిని దొంగలు దొంగలు ఊళ్లు పంచుకోవడమే అసలు కథ. అంచెలంచెలుగా అమలుచేసే కుట్ర దీని వెనుక దాగున్నది. ధరను నానాటికి తీసికట్టు చేయడంలోనే, ఎకరా ధరను వంద కోట్ల నుంచి 23 కోట్లకు తగ్గించడంలోనే కిటుకంతా ఉన్నది. దాదాపు సగం ధరకే దక్కించుకోవాలనే ఆ తొందర.., ఆ ఉరుకులాట అని స్పష్టమైపోతున్నది.

అడివే కాదని, జీవాలే లేవని బుకాయింపులు అందుకే. రాత్రికి రాత్రే చెద పురుగుల్లా బుల్డోజర్‌లు అడవిని కబళించడమూ అందుకే. నోరు లేని జీవాల ఉసురు తీసిందీ అందుకే. తర్వాత మారిన పరిస్థితుల్లో ఎకో పార్కు అభివృద్ధి చేస్తామంటూ నాలుక మడత పెట్టిందీ అందుకే. పైగా మరింతగా భూమిని విశ్వవిద్యాలయం నుంచి తీసేసుకుంటారట. అసలీ ఆరాటమంతా ఎందుకోసం? ఏదో రకంగా భూమిని విడదీసి ముక్కలు చేసి గద్దల్లా వాలిన పెద్దలకు పలహారంగా సమర్పించడం, తద్వారా తిలా పాపం తలాపిడికెడు అన్నట్టుగా తామూ లబ్ధి పొందడం దీనంతటి వెనుకనున్న శక్తుల అసలు ఉద్దేశం అని చెప్పక తప్పదు. ప్రజల భూమిని పరాధీనం చేసే ఈ కుట్రకు కొన్ని మీడియా శక్తులు కొమ్ముకాయడం, న్యాయ వ్యవస్థనే నిలదీయడం విడ్డూరం. అడ్డికి పావుశేరు అమ్ముకోవడానికి అది కాంగ్రెస్ పాలకుల ప్రైవేటు జాగీరు కాదన్నది గుర్తుంచుకోవాలి.

త్యాగాల నిచ్చెన వేసి.. బీఆర్ఎస్@ 25 ఏండ్లు

డాక్టర్ ఆంజనేయ గౌడ్

నిప్పులు గర్భాన దాల్చిన నేలమ్మే సూర్యోదయాన్ని కన్నట్టు, నెత్తురు, చెమట పారి పోరు పంటై ప్రభవించినట్టు, ఇసుక ఎడారిలో భవితవ్యం వికసించినట్టు గులాబీ జెండా ఆవిర్భావమే అపురూప విప్లవం కదా..! తమ నుంచి అంతా కోల్పోయిన మానవ సమూహం, మూకుమ్మడిగా తమఆశలను సైతం జమ్మిచెట్టుపైకి చేర్చి వలసెల్లి పోతూనో, లేదా ఎదురెళ్లి రాజ్యహింసకు ఒరిగిపోతూనో ఉన్న సందర్భం అది. తెలంగాణ పదమే రాజ్య నిషేధిత ఎజెండాగా మారి, దానిపై గొంతెత్తిన మనుషులనే ముక్కలుగా, సంస్థలనే శత్రువులుగా సర్కారే ఏరేస్తున్న భయానక కాలం అది.

సంఘాలు పెట్టడాన్నే రాజ్యద్రోహంగా పరిగణిస్తున్న సమయంలో తెలంగాణ కోసం ఏకంగా రాజకీయ పార్టీని ఎత్తిపట్టడమంటే హైనా ఎదుట నిలబడి నెమలి మీసం మెలేయడమే. అపారమైన వనరులు, మీడియా, కేంద్ర సర్కార్ అండదండలతో పట్టపగ్గాల్లేని అధికారోన్మాదంతో ఊరేగుతున్నది ఆనాటి చంద్రబాబు సర్కార్. అలాంటి పాశవిక ప్రభుత్వానికి ఎదురునిలబడటం, అందులోనూ వ్యతిరేకంగా రాజకీయ పోరును ప్రకటించడమెంత సాహసమో ఊహిస్తేనే ఒళ్లు జలదరించకమానదు. ఉక్కు సంకల్పం, తెలంగాణ స్వప్నం తప్ప ఏ బలవంతులు, ధనవంతుల ఆసరా లేని కేసీఆర్, ఒంటరిగా ఆనాడు దేశంలోనే శక్తివంతమైన చంద్రబాబు సర్కార్‌తో తలపడటమన్నది రాజకీయంగానే కాదు వ్యక్తిగతంగానూ ఎంత ప్రమాదకరమైన సాహసమో చరిత్రను తడిమిన మనసున్న వారెవరికైనా అర్థమైపోతుంది.

వాస్తవానికి కౌమార దశలోనే వివిధ ఉద్యమాల్లో నలిగిన తర్వాత డిగ్రీ చదువుల కోసం నిజాం కళాశాలలో చేరిన నాలాంటి మిత్రులమే కొందరం, టీఆర్ఎస్ ఆవిర్భావానికి మునుపు జరిగిన కొన్ని రాజకీయ, సామాజిక విషాదకర పరిణామాలను కొంత దగ్గరగా చూడగలిగాం. విద్యార్థి సంఘాల పోరాటాలు, భిన్న భావజాల సంఘర్షణలతో అలజడి జీవితాన్ని కొనసాగిస్తున్న సందర్భంలోనే బషీర్‌బాగ్ విద్యుత్తు ఉద్యమం, హైదర్‌గూడ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో వైఎస్సార్ దీక్ష, విరమణ రాజకీయం, వామపక్ష, ప్రజాసంఘాల పోరాట స్థలాల్లోనూ భాగస్వామిగా ఉండి వాటన్నింటినీ దగ్గరగా చూసి వివిధ కోణాల్లో అర్థం చేసుకోగలిగాం. డిప్యూటీ స్పీకర్‌గా ఉండిన కేసీఆర్ విద్యుత్తు ఛార్జీల పెంపుపై నాడు సంధించిన లేఖాగ్ని రగిలించిన జనదావాగ్నిపై, దానితో ఎదురులేని సర్కార్‌గా ఊరేగుతున్న చంద్రబాబు ప్రభుత్వంపై పడ్డ పోలిటికల్ పిడుగుపై అన్నివర్గాల్లో విస్తృతమైన చర్చ నడిచింది. బషీర్‌బాగ్ విద్యుత్తు కాల్పులు నిజాం కళాశాల ముందే జరిగితే, నేను నాటి ఎస్ఎఫ్ఐలో క్రియాశీల భూమిక పోషిస్తున్న ముత్యాలు తదితర మిత్రులందరం పోలీస్ లాఠీ, తూటా, టియర్ గ్యాస్‌దెబ్బల బాధితులను నిజాం కళాశాల గేటు లోపలికి ఎత్తుకొని వచ్చి సపర్యలు చేసి, దవాఖానలకు తరలించాం. ఇలా ఎన్నో.. బెల్లి లలిత కిరాతక హత్యను ఖండిస్తూ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సాయంత్రం పూట జరిగిన ప్రజా సంఘాల సభ కన్నీటి సముద్రంగా మారింది.

> అసెంబ్లీ, బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్, సుందరయ్య విజ్ఞానకేంద్రం మధ్యలో ప్రజా ఆకాంక్షల చుట్టూ పేనుతున్న వివిధ విషాద వలయాలను గమనించేవారం. ఇవన్నీ చూసిన మేము నిజాం కళాశాల హాస్టల్‌కు అడుగుల దూరంలోనే ఉన్న జలదృశ్యం ప్రాంగణంలో 2001లో జరిగిన టీఆర్ఎస్ ఆవిర్భావ సభాస్థలి చుట్టూ రెండు, మూడురోజుల ముందు నుంచే చక్కర్లు కొట్టాం. సభ ఆద్యంతం కురిసిన ఉద్రేకాన్ని, కేసీఆర్ త్యాగాల భావోద్వేగాన్ని స్వయంగా చూసిన తర్వాత ఉద్యమాలకు సంజీవని పర్వతం తోడైందనే సంపూర్ణ విశ్వాసం కలిగింది.

అందరం భావించినట్టే తొలి అడుగులోనే తెలంగాణ ఆత్మగౌరవ పోరాటానికి ఉన్నతమైన రాజకీయ వివేకాన్ని జోడించి, విరోధులు ఉలిక్కిపడేలా ప్రజాబాట పట్టింది టీఆర్ఎస్. అయితే నాటికి తెలంగాణ డిమాండ్‌కు దేశంలోనే బలవంతుడైన రాజకీయ విరోధి చంద్రబాబు సర్కార్‌కు సహజంగానే కేసీఆర్ ప్రధాన శత్రువుగా మారిపోయాడు. వరంగల్‌లో తీవ్రమైన పోలీస్ నిర్బంధాన్ని ఎదుర్కొంటూ, రాజ్యం టార్గెట్‌గా మారిన కుసుమ జగదీశ్‌ను కాపాడే ఉద్దేశ్యంతో కేసీఆర్ హైదరాబాద్ తీసుకొచ్చి జలదృశ్యం కార్యాలయ పర్యవేక్షణ పనిలో పెట్టాడు. అంతకుముందే ఇతర ఉద్యమాల్లో జగదీశ్‌తో ఉన్న ఆత్మీయ బంధం దృష్ట్యా, ఉదయం నాలుగింటికే నవజవాన్ ఉటో అంటూ నిద్రలేపే కొండా లక్ష్మణ్ బాపూజీ ధాటికి తట్టుకోలేక రాత్రి

కాగానే నా హాస్టల్ రూంకు వచ్చి పడుకొని ఉదయమే జగదీష్ జలదృశ్యం ఆఫీస్‌కు వెళ్లేవాడు. ఆ సందర్భంగా రెగ్యులర్‌గా ఆ ఆఫీస్‌కు వెళ్లే మాకు ఆనాడు మొగ్గ దశలోనే గులాబీ జెండాకు నిప్పుపెట్టడానికి యమకింకర సర్కార్ ఎన్ని విశ్వప్రయత్నాలు చేసేదో నాయకుల చర్చలు, పరిస్థితుల అధ్యయనం వల్ల తెలిసేది. పార్టీ, కేసీఆర్ అకౌంట్లలో నకిలీ కరెన్సీ జమచేసే ప్రయత్నం చేసి అక్రమ కేసుల్లో ఇరికించాలని, ఉద్యమంలోకి వచ్చిన ఒకరిద్దరు నేతలు మళ్లీ తిరిగి రాకుండా లొంగదీసుకుంటూ, కేసీఆర్ ఇంటి చుట్టూ, ఆఫీస్ నలువైపులా, అడుగు బయటపెడితే అడుగడుగునా నిఘావ్యవస్థ గద్దల్లా సంచరించేది అందరికీ తెలిసిపోయేది.

కుదిరితే రోడ్డు ప్రమాదం రూపంలోనో మరే ఇతర కుయుక్తుల ద్వారానో కేసీఆర్‌ను కూడా భౌతికంగా అడ్డుతొలగించుకోవాలనే విశ్వప్రయత్నాలను సైతం ఆనాటి గండరగండులు తీవ్రంగా చేస్తున్నారనే విషయం సైతం చర్చలో ఉండేది. అయితే గులాబీ జెండా ఎగరేయక ముందే, ఏడాదికి పైగా భిన్నకోణాల్లో తెలంగాణ డిమాండ్‌ను, వాస్తవ భౌతిక పరిస్థితులను, దేశ, అంతర్జాతీయ రాజకీయ, సామాజిక పోరాటాలను, వాటి పట్ల సర్కార్‌ల దమననీతిని క్షుణ్ణంగా అధ్యయనం చేసిన కేసీఆర్, అన్ని త్యాగాలకు సిద్ధపడే తెలంగాణ సాధన సమరంలోకి దూకడం వల్ల విరోధులను విష వ్యూహాలను ఎదుర్కోగలిగాడు. కేసీఆర్ కాబట్టి నిలదొక్కుకొని, రాజకీయ పార్టీని, ఉద్యమ పంథాను ప్రజా స్వామ్యబద్ధంగా ముందుకు నడిపించగలిగాడు కానీ, మరో నేత ఎవరైనా కిరాతక సర్కార్ వలలో సులభంగా పడి కనుమరుగైపోయేవాడే.

> ఉద్యమ పార్టీగా టీఆర్ఎస్‌ను నీటిలో చేపలా ప్రజల్లో మమేకం చేసేందుకు కేసీఆర్ పడ్డ కష్టం, చేసిన సాహసాలు, త్యాగాలు, వ్యూహాలు బహుశా దేశంలో మరే ఇతర పార్టీగాని, నేతలు గాని చేసి ఉండరు. టీఆర్ఎస్ పుట్టకముందే పలుమార్లు దెబ్బతిని ఆత్మన్యూనతతో, ఎవరినీ నమ్మలేని అనుమానంతో తెలంగాణ సమాజం సతమతమవుతున్న సంధి కాలమది.

విశ్వాసం సన్నగిల్లిపోయిన సమాజం ఒకవైపు, దుర్వేధ్యమైన, సకల వనరులతో ఎదుర్కోవలిసిన వెయ్యి తలల తెలంగాణ విరోధి మరోవైపు. ఇలా విచిత్రమైన పద్మవ్యూహంలో నిలబడి కేసీఆర్ ఉద్యమ కార్యాచరణ ప్రణాళికను రూపొందించి, అమలుచేశారు. జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్, ఉత్తరాంచల్ సహా ఈ ఐదు దశాబ్దాల్లో దేశంలో జరిగిన ఏ ప్రత్యేక రాష్ట్ర పోరాటానికి ఎదురవ్వని, అక్కడి నాయకత్వం కలలో కూడా ఊహించని సంక్లిష్టమైన పరిస్థితులను కేసీఆర్ ఎదుర్కోవలిసి వచ్చింది. పాదయాత్రలతో నీళ్లల్లో నిప్పులు మం డించి, ధర్నాలతో తెలంగాణలో ధైర్యం వెలిగిం చి, బహిరంగ సభలతో జన సునామీలను సృ ష్టించి, రాజీనామా త్యాగాలు ధారపోసి విశ్వాసా న్ని పండించి ఇలా ఎన్నోసార్లు సీతమ్మ తల్లిలా అగ్గిలో దూకి ప్రత్యేక రాష్ట్ర పోరాట ప్రాతివత్యాన్ని కాపాడి, దేశం కళ్లు తెరిపించాడు కేసీఆర్.

చివరికి ఆమరణ దీక్షతో ప్రాణత్యాగానికీ సిద్ధపడి నలుదిక్కులా నిప్పుల వర్షం కురిసేలా చేసి, తెలంగాణ ఆవిర్భావానికి మార్గం సుగమం చేశాడు. రాష్ట్ర ఏర్పాటు తర్వాత కూడా ఎని మిదేండ్లలోనే అనేక అవాంతరాలను అధిగమించి తెలంగాణను విఫల రాష్ట్రం కాకుండా సర్వశక్తులు ఒడ్డి తాను శ్రమించడమే కాకుండా అన్ని స్థాయిల వ్యవస్థలనూ పరుగులు పెట్టించారు. ఈ ప్రయాణం ఎంత భీతావహమో కదా? ఎత్తుకున్న తెలంగాణపై ఎంత ప్రేమ ఉంటే కత్తుల వంతెనపై నడువగలరు? టీఆర్ఎస్ తొలినాళ్లలో ఒకసారి ఓయూ క్యాంపస్ నుంచి కొంతమంది మిత్రులం నిర్మాణంలో ఉన్న నందినగర్ ఇంట్లో కేసీఆర్‌తో సమావేశమైన సందర్భంగా ఒక విద్యార్థి మిత్రుడు ఇదంతా సాధ్యమా సార్ అంటూ అనుమానపడ్డాడు. అంతే కేసీఆర్ ఆవేశంగా ఏందయ్యా.. మీరంతా యువకులు, అవసరమైతే ఆకాశానికి సైతం అగ్గిపెడతమనే ఆత్మవిశ్వాసం ఉండాలి కానీ, ఇలా మాట్లాడరాదంటూ హెచ్చరించాడు. బహుశా అంతకుమించిన విశ్వాసాన్ని నిరంతరం శ్వాసించబట్టే త్యాగాల నిచ్చెనేసి తెలంగాణను అస్తిత్వ శిఖరంపై కూర్చోబెట్టగలిగారు. దానివల్లనే బీఆర్ఎస్ రజతోత్సవ మహాసభపై 20 రోజుల ముందే పల్లెల్లో భావోద్వేగం ఏర్పడింది. సహజంగా రాజకీయ పార్టీల సభలు తరలింపు, మళ్లింపు అన్నట్టుగా జరిగిపోతాయి. కానీ, ఒక రాజకీయ పార్టీ రజతోత్సవం చరిత్రలోనే ఇంతలా చర్చనీయాంశం కాలేదు. అద్వితీయమైన గతాన్ని చూసిన ప్రతివారూ మనసారా అందరిలో నెమరేసుకుంటేనే కదా నూతన తరానికి నిజాలు తెలిసేది?

(వ్యాసకర్త: రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ మాజీ చైర్మన్)

తక్కెళ్లపల్లి రవీందర్‌రావు
950 580 6666

ఆఫ్రికన్లు ఆదర్శప్రాయులు

ఆఫ్రికా దేశాలంటే ప్రపంచంలోని చాలామంది ప్రజలకు అవి వెనుకబడిన దేశాలనే అపోహ ఉన్నది. వారికే కాదు, నాక్కూడా ఆయా దేశాల్లో పర్యటించే వరకు ఆఫ్రికా దేశాలు అభివృద్ధిలో వెనుకంజలో ఉన్నాయనే దురభిప్రాయం ఉండేది. కరీంనగర్ మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్, ప్రపంచ పర్యావరణ సంస్థ శాస్త్రవేత్త బిక్షంలతో కలిసి నేను ఇటీవల, మార్చి 10 నుంచి 22వ తేదీ వరకు ఆఫ్రికాలోని ఉగాండా, కెన్యా, టాంజానియా దేశాల్లో 12 రోజుల పాటు పర్యటించాను. ఈ పర్యటనలో భాగంగా అక్కడ మేము పరిశీలించిన విషయాల సంక్షిప్త సమాచారమే ఈ వ్యాసం.

ఆఫ్రికా దేశాల్లో వెనుకబడిన ప్రాంతాలు, విపరీతమైన ఎండలు, ఆహార కొరత, దొంగతనాలు, దోపిడీలు, అపరిశుభ్రత కారణంగా విపరీతమైన రోగాలు వ్యాపిస్తాయనే అపోహ ఉండేది. అందుకే, మేము ఆ రోగాల బారిన పడకూడదనే భయంతో ఆఫ్రికా దేశాలకు వెళ్లేముందు ఎల్లో కవర్ వ్యాక్సినేషన్ కూడా చేసుకొని వెళ్లాము. కానీ, అక్కడి పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. ఆఫ్రికా దేశాల గురించి మేము విన్నవన్నీ అసత్యాలనిపించింది. నిజంగా అక్కడి ప్రజలు కష్టపడి పనిచేసే శ్రమజీవులు. ఆఫ్రికా దేశాల్లో సారవంతమైన భూములున్నాయి. అంతేకాదు, విశాలమైన పచ్చిక బయళ్లు, మంచి వాతావరణం కలగలిసి బ్రహ్మాండమైన పంటలు అక్కడి ప్రజలు పండిస్తున్నారు. గ్రామాలు, వ్యవసాయ క్షేత్రాలు, పరిశ్రమలు, వ్యాపార సంస్థలను సందర్శించాం. అక్కడి డెవలప్‌మెంట్ అథారిటీలనూ కలిసి వివరాలు తీసుకున్నాం.

ఆఫ్రికా దేశాలు అభివృద్ధి వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశాలు. అక్కడి ప్రజలు గుండెల నిండా ప్రేమ కలిగి ఉన్నారు. చిన్న నేరాలు కూడా జరగని ప్రాంతాలున్నాయంటే అతిశయోక్తి కాదు. అక్కడి వాతావరణం ప్రశాంత జీవనానికి అనుకూలంగా ఉన్నది. కెన్యా, నైరోబీ, ఉగాండా లాంటి ప్రాంతాల్లోనైతే ఫ్యాన్లు, ఏసీల అవసరమే రాలేదు. ఏడాదిలో 4 నెలలు వర్షాలు. 2 నెలలు కాస్త ఎండలు. మళ్లీ 4 నెలలు వర్షాలు, ఆ తర్వాత 2 నెలలు మళ్లీ మామూలు ఎండలు. అంటే ఏడాదిలో 8 నెలలు వర్షాలుంటే, 4 నెలలు మాత్రమే కాస్త పొడి ఎండలుంటాయి. బావులు, బోర్లు, చెక్ డ్యాములు, ప్రాజెక్టులు, కాల్వలు మాకెక్కడా కనిపించలేదు. సహజ సిద్ధమైన వర్షాలతోనే వ్యవసాయం సాగుతున్నది. ఎగుడు దిగుడు మట్టిదిబ్బలు, పచ్చని పచ్చిక బయళ్లు, అందమైన లాండ్ స్కేపింగ్, ఎక్కువ శాతంగా అటవీ ప్రాంతం, జీవ జంతుజాలాన్ని మేం చూశాం.

విచిత్రమేమంటే అక్కడి ప్రభుత్వాలు ప్రజలకేవీ ఉచితంగా ఇవ్వవు. రక్షణ, కోర్టులు తదితర వ్యవస్థలు మాత్రమే ప్రభుత్వ ఆధ్వర్యంలో నడుస్తాయి. కొంతమేరకు విద్య, వైద్యం తప్ప ప్రభుత్వం నుంచి ఇతరత్రా ఆశించేదేమీ ఉండదు. ఆఫ్రికా దేశాల్లో మహిళలకు పూర్తి స్వేచ్ఛ ఉంటుంది. కుటుంబ పెద్ద మహిళనే. ప్రతి మహిళ తన శక్తిమేరకు వివిధ కంపెనీలలో, డిపార్టుమెంట్లలో పనిచేస్తుంది. మహిళలు పని చేయని రంగం అంటూ లేనే లేదు. ప్రతి రంగంలో మహిళలదే పైచేయి. పిల్లలకు చదువు సంధ్యలు నేర్పించి, వారిని పెంచి పెద్దచేసే బాధ్యత కూడా మహిళలే తీసుకుంటారు. అలాగని, అక్కడ పురుషులను చిన్నచూపు చూడరు.

> తరాలకు సరిపడా ఆస్తులు కూడబెట్టాలనే అత్యాశ ఆఫ్రికా దేశ ప్రజలకు లేదు. ఎవరి కష్టం వాళ్లది. ఎవరి కష్టఫలాన్ని వారే అనుభవిస్తారు. ఈ గొప్ప సారాంశం అక్కడి ప్రజల జీవనశైలిలో మాకు కనిపించింది. ఇతరుల సొమ్మును ఆఫ్రికా దేశస్థులు ఆశించడం లేదు. అంతెందుకు మా 12 రోజుల పర్యటనలో చేయి చాపి అడుక్కునే వారు ఒక్కరూ కనిపించలేదు. ప్రజలకు ఏదీ ఉచితంగా అందించకపోయినా అక్కడి ప్రజల్లో ప్రభుత్వాలపై వ్యతిరేకత లేదు.

అసలు రాజకీయాలను వారు పట్టించుకోరు. అక్కడి ప్రజలకు ప్రకృతి అంటే మక్కువ. అభివృద్ధి చేయకున్నా మంచిదే గానీ, వనరులను, ప్రకృతిని విధ్వంసం చేయవద్దని ప్రజలు కోరుకుంటారు. ఇదంతా చూసిన తర్వాత ఈ ఆఫ్రికా దేశాల పట్ల ఎందుకంత దురభిప్రాయం ఏర్పడిందోనని నాలో నేను చాలా బాధపడ్డాను. వారిపై జరిగిన దుష్ప్రచారాలను ఇన్నిరోజులు ఎందుకు నమ్మామా అని మధనపడ్డాను.

> ఆఫ్రికా దేశాల ప్రజలకు ప్రకృతి అంటే మక్కువ. అభివృద్ధి చేయకున్నా మంచిదే గానీ, వనరులను, ప్రకృతిని విధ్వంసం చేయవద్దని వాళ్లు కోరుకుంటారు. ఇదంతా చూసిన తర్వాత ఈ ఆఫ్రికా దేశాల పట్ల ఎందుకంత దురభిప్రాయం ఏర్పడిందోనని నాలో నేను చాలా బాధపడ్డాను. వారిపై జరిగిన దుష్ప్రచారాలను ఇన్నిరోజులు ఎందుకు నమ్మామా అని మధనపడ్డాను.

అక్కడి భూములు గ్రామ కమ్యూనిటీ ఆధీనంలోనే ఉంటాయి. ప్రజలకు భూములు కావాలంటే కమ్యూనిటీలే ఇస్తాయి. భూములిస్తే తీసుకోవడం, వ్యవసాయం చేసుకోవడమే తప్ప, ఇది నా భూమి, ఇదిగో నా భూమి పట్టా, నా భూమి, నా ఇష్టం అనే వాతావరణం లేదు. ఒక్కో కుటుంబం కట్టుకునే ఇల్లు వెయ్యి గజాల పైనే ఉంటుంది. ప్రతి ఇంట్లో ఆలుగడ్డ, టమాటాలతో తయారుచేసుకొని తినే ఉగ్గానీ ఆహారం గానీ, ఆహారంగా తినే కవాసా చెట్ల గడ్డలు గానీ, ఇతర కూరగాయలు గానీ, పండ్లు గానీ ఉంటాయి. దైనందిన జీవితంలో వారికేం కావాలో వాటన్నింటినీ వారే పండించుకుంటారు, ఇతరులపై ఆధారపడటం లేదు. సారవంతమైన ఎర్ర నేలలు, నల్ల నేలలు. ట్రాక్టర్లుండవు, ఎడ్లుండవు. మరేం చేస్తారో తెలుసా? విత్తులు నాటుతారు, ఆ విత్తులే పంట్టె పండుతుంది. వారు పండించిన ఆహారాన్నే తింటారు తప్ప, బయటి ఫుడ్‌ను ఇష్టపడరు. ఫెర్టిలైజర్స్, పెస్టిసైడ్స్ అసలు వాడరు. ఇంటిఖర్చుల కోసం ఆవులను పెంచి, వాటి పాలను అమ్ముకుంటారు. 70 ఏండ్లు వచ్చిన వృద్ధులు కూడా పని చేస్తూనే ఉన్నారు.

అక్కడి ప్రజలు వారంలో 5 రోజులు పని చేస్తే, మిగతా 2 రోజులు స్వేచ్ఛగా తమ కష్టఫలాన్ని అనుభవిస్తున్నారు. ఇదిలా ఉంటే ఆఫ్రికా దేశాల రోడ్లపై సిగ్నలింగ్ వ్యవస్థ సరిగా ఉండదు. పోలీసులు కూడా పెద్దగా కనిపించరు. అయినప్పటికీ ప్రజలు మాత్రం రోడ్లపై ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తారు. కారు వెనుక కారు వెళ్తుందే తప్ప దాటిపోవడాలు మాకు ఎక్కడా కనిపించలేదు. ప్రజలు క్రమశిక్షణతో, ప్రభుత్వ నిబంధనలను పాటిస్తున్నారు. ఎంత గొప్ప సమాజం అది. కష్టపడి జీవించడంలో వారికి వారే సాటి. 'మీ ప్రభుత్వం మీకు ఏమీ ఉచితంగా ఇవ్వదా?' అని మేం అడిగితే... 'ప్రభుత్వం మాకు ఎందుకు ఇవ్వాలి?' అని వారే మమ్మల్ని ఎదురు ప్రశ్నించారు. 'ప్రభుత్వానికి మేం పెద్దగా కట్టేదేమీ ఉండదు, ప్రభుత్వం కూడా మాకేమీ ఇవ్వదు' అనే గొప్ప సమాధానం ఇచ్చారు. 'మూడు, నాలుగు దశాబ్దాలుగా ఒకరే అధ్యక్షులుగా ఉన్నారెందుకు' అని ప్రశ్నిస్తే... 'ఎవరుంటే మాకెందుకు? వారెవరూ మిమ్మల్ని డిస్టర్బ్ చేయరు, ఇబ్బంది పెట్టరు, మాపై అనవసరమైన పన్నులు వేయరు. మా కష్టం మేం పడుతం, మా సంపాదన మేం తింటాం, మా జీవితాలు సంతృప్తికరంగానే ఉన్నాయి' అని సంతోషంగా చెప్పారు.

మనం ఆఫ్రికా దేశాల ప్రజల నుంచి నేర్చుకోవాల్సినది ఏమన్న ఉన్నదా అంటే చాలానే ఉన్నదని చెప్పుకోవాలి. వారు తమ ఇండ్లలో పాటించే పరిశుభ్రతను మనం కూడా పాటించాలి. బహిరంగ ప్రదేశాల్లో మల, మూత్ర విసర్జన అసలే ఉండదు. ఇది కూడా మనం నేర్చుకోవాల్సిందే. ఆఫ్రికా దేశాల్లో జాతీయ పార్కులు ఎన్నో ఉన్నాయి. మేం చాలా పార్కులే తిరిగాం. ఒక స్వీడిష్ దేశస్థుడు ఉగాండాలో ఒక దీవిని లీజుకు తీసుకొని ప్రభుత్వ అనుమతితో సింహాలు, చిరుతపులులు, ఏనుగులు తదితర జంతువులతో జూ పార్కును నిర్వహిస్తున్నాడు. అక్కడ సింహాలకు అలవాటు పడిన వ్యక్తుల రక్షణలో మేం వాటిని ముట్టుకొని మంచి అనుభూతిని పొందాం. ఇలాంటి అనుభూతులు ఇంకెన్నో ఉన్నాయి.

ఆఫ్రికా దేశాల ప్రజల్లో.. స్వతంత్ర భావాలు కలిగి ఉండటం, స్వేచ్ఛగా జీవించడం, ప్రభుత్వాలపై ఆధార పడకుండా జీవించడం, దేశం పట్ల ఎక్కువ ప్రేమాభిమానాలు కలిగి ఉండటం వంటివి మాకు చాలా నచ్చాయి. కష్టపడి పనిచేయడం తప్పితే, రాబోయే తరాలకు ఆస్తులు సంపాదించిపెట్టాలనే అత్యాశ అక్కడి ప్రజల్లో మాకు కనిపించలేదు. మన దేశంలోని మధ్యతరగతి ప్రజలు ఆఫ్రికా దేశాల ప్రజల జీవన స్థితిగతులను గనుక పరిశీలిస్తే... వారు తమ జీవనశైలిని, అలవాట్లను, అభిప్రాయాలను తప్పక మార్చుకుంటారు. అందుకే మనం అభివృద్ధి చెందిన యూరోపియన్ దేశాలను సందర్శించే బదులుగా.. అభివృద్ధి చెందుతున్న, మన జీవనశైలికి దగ్గరగా ఉన్న ఆఫ్రికా దేశాలను సందర్శించాలని విజ్ఞప్తి చేస్తున్నా. దీంతో అక్కడి ప్రజల నుంచి మనం ఎన్నో విషయాలు నేర్చుకోవచ్చు. మొత్తంగా చెప్పేదేమంటే... ఇంకో పదేండ్లలో ఈ ఆఫ్రికా దేశాలు మరింతగా అభివృద్ధి చెందుతాయి. ప్రపంచంలోని మరెన్నో దేశాలకు మార్గదర్శకంగా ఉంటాయనడంలో ఏ మాత్రం సందేహం లేదు.

(వ్యాసకర్త: శాసనమండలి సభ్యులు)

> తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావానికి ముందు ఉమ్మడి ఏపీలో ప్రపంచ దేశాల సదస్సు జరిగింది. కాప్ 11 పేరిట నిర్వహించిన బయో డైవర్సిటీ కాన్ఫరెన్స్‌ను నాటి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించింది. దాదాపు 190 దేశాల నుంచి పర్యావరణవేత్తలు, ప్రభుత్వాధినేతలు, విదేశీ రాయబారులు, శాస్త్రవేత్తలు మేధావులు ఈ సదస్సుకు హాజరయ్యారు. 2012, అక్టోబర్ 1 నుంచి 19 వరకు ఈ సదస్సు జరిగింది. విదేశీ ప్రతినిధులను ఆకట్టుకునేందుకు రూ.350 కోట్లు వెచ్చించి హైదరాబాద్‌ను సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. అంతేకాదు, 'ప్రతి జీవప్రాణిని కాపాడుకునే బాధ్యత మనది', 'వృక్షాలను పెంచండి', 'చెట్లను నరకొద్దు-జీవ హాని తలపెట్టవద్దు', 'ఇంకుడు గుంతలు తవ్వించి జీవధారను సొంతం చేసుకుందాం' వంటి నినాదాలతో నాటి కాంగ్రెస్ ప్రభుత్వం ఫ్లెక్సీలను ఏర్పాటు చేసింది.

జీవ వైవిధ్యం సృష్టించగలమా?

స్క్రీన్ కట్ చేస్తే... 2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైంది. తదనంతరం తొమ్మిదిన్నరేండ్ల పాటు కేసీఆర్ పాలన. 2023, డిసెంబర్ 7 నుంచి కాంగ్రెస్ తిరిగి అధికారం చేపట్టింది. 16 నెలల కాంగ